# ముఖ్యమంత్రి కార్యాలయము
# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 19-07-2017**

ఎకరానికి ఏడాదికి 8వేల రూపాయల పెట్టుబడి అందించే కార్యక్రమంతో పాటు, భూమి రికార్డులన్నీ పారదర్శకంగా నిర్వహించే విధానం అమలు చేయాడానికి అవసరమైన రైతు సంఘాల ఏర్పాటు కార్యక్రమాన్ని వెంటనే ప్రారంభించాలని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు ఆదేశించారు. రైతు సంఘాల ఏర్పాటు, భూ రికార్డుల సక్రమ నిర్వహణ తదితర అంశాలపై ముఖ్యమంత్రి మంగళవారం ప్రగతి భవన్ లో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో రైతు సంఘాల ఏర్పాటుకు సంబంధించి విధి విధానాలు ఖరారు చేశారు. ఎకరానికి ఎనిమిది వేలు పెట్టుబడి కోసం ఇచ్చే కార్యక్రమంలో గానీ, భు రికార్డుల నిర్వహణలో కూడా రైతులు ఎక్కడ ఇబ్బంది పడకుండా, ఎవరి వద్దకు వెళ్లకుండా, ఎవరికీ ఒక రూపాయి ఇవ్వకుండా ఉండే విధంగా విధానాన్ని ఖరారు చేశారు. వచ్చే నెలలో భు రికార్డుల సక్రమ నిర్వహణకు సంబంధించిన స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ రెండు కార్యక్రమాలపై అవగాహనా కల్పించడానికి కొద్ది రోజుల్లోనే హైదరాబాద్ లో అవగాహన సదస్సు నిర్వహించాలని నిశ్చయించారు. ఈ సమీక్షలో ఉప ముఖ్యమంత్రి శ్రీ మహమూద్ అలీ, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు శ్రీ రాజీవ్ శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ ఎస్.పి. సింగ్, ఎమ్మెల్యేలు శ్రీ డి.ఎస్. రెడ్యానాయక్, శ్రీ మర్రి జనార్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ శ్రీ కర్నె ప్రభాకర్, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు శ్రీ ఎస్. నర్సింగ్ రావు, శ్రీ బి.పి. ఆచార్య, శ్రీ బీ.ఆర్. మీనా, శ్రీ రాజేష్ తివారి, శ్రీ శివ శంకర్, శ్రీ ఉమర్ జలీల్, శ్రీ ఉత్పల్, కార్యదర్శి శ్రీమతి స్మితా సభర్వాల్, వివిధ జిల్లాల కలెక్టర్లు శ్రీ రఘునందన్ రావు, శ్రీ వెంకట్రామ్ రెడ్డి, శ్రీ ఎంవి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘాల ఏర్పాటు, భూ రికార్డుల నిర్వహణకు సంబంధించి ఖరారు చేసిన విధి విధానాలు:

- ప్రతీ రెవెన్యూ గ్రామానికి ఒకటి చొప్పున గ్రామ రైతు సంఘాన్ని ఏర్పాటు చేస్తారు. వ్యవసాయాధికారులు గ్రామాల్లో ఇప్పటికే రైతు సమగ్ర సర్వేను పూర్తి చేసినందున, ఆ వివరాల ఆధారంగా వ్యవసాయ భూమి కలిగిన ప్రతీ రైతును సభ్యుడిగా చేర్చి గ్రామ సంఘాన్ని ఏర్పాటు చేయాలి. గ్రామ రైతు సంఘానికి ప్రాతినిధ్యం వహించేందుకు 11 మంది సభ్యులతో గ్రామ రైతు సమన్వయ సమితిని ప్రభుత్వం నియమిస్తుంది
- రైతు సమన్వయ సమితిలో తప్పకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళా రైతులకు ప్రాతినిధ్యం ఉంటుంది. రెవెన్యూ గ్రామంలో తప్పకుండా భూమి కలిగి, వ్యవసాయం చేస్తున్న రైతులనే సమన్వయ

సమితిలో సభ్యులుగా నియమిస్తారు. రైతు సంఘాలే రైతులకు అవసరమైన అన్ని కార్యక్రమాలను తమ భుజస్కంధాలపై వేసుకుని నిర్వహిస్తాయి

- గ్రామ రైతు సమన్వయ సమితిల సమాహారంగా మండల రైతు సమన్వయ సమితి సమాహారంగా మండల రైతు సమాఖ్యల సభ్యులతో జిల్లా రైతు సమాఖ్య, జిల్లా రైతు సమాఖ్య సభ్యులతో రాష్ట్ర రైతు సమాఖ్య ఏర్పాటు అవుతుంది. ప్రతీ సమాఖ్యకు సమన్వయ సమితిని ప్రభుత్వం నియమిస్తుంది
- వ్యవసాయాధికారులు ఇప్పటికే రైతు సమగ్ర సర్వేను నిర్వహించారు. దాని ఆధారంగా భూమి కలిగిన రైతుల జాబితా సిద్ధమైంది. ఆ రైతులే గ్రామ రైతు సంఘంగా చలామణి అవుతుంది. వీరిలోంచి 11 మందిని సమన్వయ సమితిగా ప్రభుత్వం ఎంపిక చేస్తుంది
- రైతు సంఘాల ఏర్పాటు ప్రక్రియ అంతా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో
- భారతదేశంలో మరే రాష్ట్రంలో కూడా జరగని విధంగా వచ్చే నెలలోనే భూమి రికార్డులన్నీ సక్రమంగా నిర్వహించే స్పెషల్ డ్రైవ్ ప్రారంభిస్తారు. ప్రస్తుతం రెవెన్యూ శాఖ వద్ద, వ్యవసాయాధికారుల వద్ద భూమి రికార్డులున్నాయి. కొన్ని భూముల విషయంలో వివాదాలున్నాయి. వివాదాలను పరిష్కరించడంతో పాటు, ఏ భూమి ఎవరిదనే విషయం స్పెషల్ డ్రైవ్ లో అధికారులు స్పష్టత ఇస్తారు. తెలంగాణలోని వ్యవసాయ భూముల రికార్డులన్నీ ఈ స్పెషల్ డ్రైవ్ లో సరిచేస్తారు. ప్రతీ ఇంచు భూమిపై ఖచ్చితమైన వివరాలు ఉంటాయి. యాజమాన్య హక్కులు ఖచ్చితంగా తేలుస్తారు. ఇక తెలంగాణలో భూమి వివాదాలే ఉండని పరిస్థితి కల్పిస్తారు. నిజాం కాలంలో తప్ప తర్వాత మరెప్పుడూ భూ రికార్డుల విషయంలో ఇంత పెద్ద క్రతువు జరుగలేదు. సాలార్ జంగ్ కాలంలో రెవెన్యూ విలేజ్ విధానం అమల్లోకి వచ్చింది. అప్పుడే గ్రామ శివార్లు నిర్ణయించబడ్డాయి. ఆ తర్వాత మళ్లీ రికార్డులన్నింటిని ఒకేసారి సరిచేసే కార్యక్రమం జరగలేదు
- స్పెషల్ డ్రైవ్ నిర్వహణ కోసం అవసరమైతే 15వేల మంది నిరుద్యోగ యువకులను నెలకు రూ.20 వేల వేతనం ఇచ్చి పని చేయిస్తారు. దీనికోసం ప్రతీ జిల్లాకు ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయిస్తారు
- గ్రామంలో అసలు ఎంత భూమి (విలేజ్ ఆబాది) ఉంది? ఎవరి పేరు మీద ఎంత భూమి ఉంది? అనే విషయాలు తేలుస్తారు. భూమి హక్కులకు సంబంధించి స్పష్టత ఇవ్వడంతో పాటు ఆ వివరాలను బహిర్గతం చేస్తారు. గ్రామంలోనే ముఖ్య కూడలి వద్ద ఆ వివరాలు ప్రదర్శిస్తారు
- ఎలాంటి వివాదాలు లేని భూములకు సంబంధించిన వివరాలను వెనువెంటనే వెల్లడిస్తారు. ఇలాంటివి దాదాపు 90 శాతం ఉంటాయని అంచనా. ఇక వివాదాలు, పొరపాట్లు ఉన్న పది శాతం భూముల విషయంలో క్షేత్ర స్థాయిలో, గ్రామ రైతు సంఘాల సమక్షంలో సమగ్రంగా, సంపూర్ణంగా విచారణ జరిపి వాస్తవాల ఆధారంగా ఏ భూమి ఏ రైతుదో తేలుస్తారు
- ఏ భూమి ఎవరిది అని లెక్క తేలిన తర్వాత కొత్తగా పాస్ పుస్తకాలు ఇస్తారు. ప్రతీ రైతుకు, పాస్ పుస్తకానికి యూనిక్ కోడ్ ఇస్తారు. ఆ వివరాలన్నీ కంప్యూటర్ లో నమోదు చేస్తారు. రాష్ట్రంలో ఎక్కడ ఎవరు భూమి కొన్నా, అమ్మినా, పేరు మార్పిడి జరిగినా, వారసులకు దక్కినా.. ఆ వివరాలన్నీ వెంటనే అన్ని కంప్యూటర్లలో, రికార్డుల్లో మారిపోతాయి

- ఇకపై భూ రికార్డుల నిర్వహణను క్లిష్టతరంగా కాకుండా సరళతరం చేయాలి
- సరిచేసిన వివరాల ఆధారంగానే ఎకరానికి 8వేల పెట్టుబడి ఇచ్చే పథకం అమలవుతుంది. భూ రికార్డులన్నీ సరిచేసిన తర్వాత ప్రకటించిన జాబితానే ప్రభుత్వానికి పంపుతారు. ప్రభుత్వం ఏ రైతు వద్ద ఎంత భూమి ఉందో, దాని ప్రకారమే బ్యాంకులో డబ్బులు జమ చేస్తుంది
- గ్రామ రైతు సంఘాలు ప్రతీ రైతుతో బ్యాంకు ఖాతా తీయించాలి. ఖాతా నెంబరు వ్యవసాయాధికారులకివ్వాలి. ప్రభుత్వం హైదరాబాద్ లోనే రైతుల ఖాతాలో డబ్బులు వేస్తుంది. రైతులు తమ పెట్టుబడి డబ్బుల కోసం ఎవరికీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. ఎవరినీ కలవాల్సిన అవసరం లేదు
- గ్రామంలో ఎవరు భూమి కొన్నా, అమ్మినా ఆ వివరాలు నమోదు చేసుకోవడం, వాటిని అధికారులకు అందచేయడం, రైతులకు పెట్టుబడి అందేలా చూడడం గ్రామ రైతు సంఘాల విధి
- మండల రైతు సమాఖ్య మార్కెట్లోని అడ్తి దారులతో నిత్యం సంప్రదింపులు జరుపుతుంది. పంటకు ధర నిర్ణయించడంలో మండల రైతు సమాఖ్య ప్రధాన భూమిక నిర్వహిస్తుంది. గిట్టుబాటు ధర నిర్ణయం జరిగిన తర్వాతే, మండల రైతు సమాఖ్య సూచనల మేరకు మార్కెట్ కు సరుకును తీసుకు వచ్చే విధానం అమలవుతుంది
- గిట్టుబాటు ధర కల్పించేందుకు రాష్ట్ర రైతు సంఘం పనిచేస్తుంది. ఏదైనా పంటకు మార్కెట్లో గిట్టుబాటు ధర రానిపక్షంలో రాష్ట్ర రైతు సంఘం జోక్యం చేసుకుంటుంది. నేరుగా పంటను కొనుగోలు చేస్తుంది. ఇందుకోసం రాష్ట్ర రైతు సంఘానికి బడ్జెట్లోనే రూ.500 కోట్ల మూల నిధిని కేటాయిస్తారు. ప్రభుత్వ గ్యారంటీతో రూ.10వేల కోట్లను రాష్ట్ర రైతు సంఘం సమకూర్చుకుంటుంది. వీటితో రాష్ట్ర రైతు సంఘం పంటను కొనుగోలు చేస్తుంది
- రైతుల నుంచి కొన్న పంటను ప్రాసెస్ చేయడానికి రాష్ట్ర రైతు సంఘానికి ప్రభుత్వం పర్మిట్లు ఇస్తుంది. ధాన్యాన్ని బియ్యంగా, పెసర్లు-కందులను పప్పుగా, మిర్చిని కారంగా, పసుపు కొమ్ములను పసుపుపొడిగా మార్చి రాష్ట్ర రైతు సంఘమే విక్రయిస్తుంది
- భూ రికార్డులను సరిచేసేందుకు గ్రామ రైతు సంఘాలే వేదిక. వారి సమక్షంలో భూమి వివరాలు సేకరణ, రికార్డులలో నమోదు చేయడం జరుగుతుంది. భూమి రికార్డులను సరిచేసేందుకు అధికారులే గ్రామాలకు వస్తారు
- ఇకపై భూమి క్రయ విక్రయాలు జరిగే విషయంలో, భూమి తండ్రి నుంచి వారసులకు బదిలీ చేసే విషయంలో, పేరు మార్పిడి విషయంలో విధానాలన్నీ పూర్తిగా సరళంగా, పారదర్శకంగా ఉంటాయి. ఎక్కడా అవినీతికి ఆస్కారం లేని విధానాన్ని రూపొందించారు
- భూమి ఎవరన్నా కొన్నా, అమ్మినా రిజిస్ట్రార్ ఆ వివరాలను సంబంధిత ఎమ్మార్వోకు, గ్రామ రైతు సంఘానికి తెలియచేయాలి. వారిద్దరికీ తెలిపిన తర్వాతే రిజిష్టర్ చేయాలి. ఈ ప్రక్రియ అంతా నాలుగు పనిదినాల్లో పూర్తి కావాలి. రిజిష్టర్ అయిన తర్వాత 15 రోజుల్లో మ్యుటేషన్ (పేరు మార్పిడి) జరగాలి.

అంతే సమయంలో పాస్ పుస్తకాలు సిద్ధం కావాలి. పాస్ పుస్తకాల్లో క్రయ, విక్రయాల వివరాలు పొందుపరచాలి

- రిజిష్టర్ కాగితాలు, పాస్ పుస్తకాలు రైతులకు నేరుగా వారింటికే కొరియర్లో పంపాలి. రైతులు ఏ అధికారిని స్వయంగా కలిసే అవసరం రాకూడదు. నిర్ణీత సమయంలో మ్యుటేషన్ చేయకున్నా, పాస్ పుస్తకాలు ఇవ్వకున్నా సంబంధిత అధికారికి ఆలస్యపు రుసుం (టిఎస్ ఐపాస్ చట్టం మాదిరిగా) విధిస్తారు
- రైతు సంఘాల నిర్మాణం, భూ రికార్డుల స్పెషల్ డ్రైవ్ పై అవగాహన కల్పించేందుకు కొద్ది రోజుల్లోనే హైదరాబాద్ లో సదస్సు నిర్వహిస్తారు. వివిధ జిల్లాల నుంచి ప్రతినిధులను పిలిపిస్తారు. ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి, ఇతర అధికారులు పాల్గొంటారు

రైతులను కష్టాల కడలి నుంచి బయట పడేసేందుకు, శాశ్వత ప్రాతిపదికన రైతుకు మేలు చేసే కార్యక్రమాలు చేపడుతున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. రాటు సనఘాల ఏర్పాటు, భూ రికార్డుల స్పెషల్ డ్రైవ్ కు సంబంధించి విధి విధానాలు ఖరారు చేసేందుకు ఏర్పాటు చేసిన సమీక్షలో ముఖ్యమంత్రి తన ఉద్దేశ్యాలను వివరించారు.

"కేవలం మన దగ్గరే కాదు, ప్రపంచ వ్యాప్తంగా కూడా రైతులు కష్టాల్లోనే ఉన్నారు. అనేక సమస్యలు రైతులను చుట్టుముడుతున్నాయి. వ్యవసాయం మీదే ఆధారపడి రైతులంతా అప్పుల ఊబిలోనే కురుకుపోయారు. సమైక్య రాష్ట్రంలో జరిగిన వివక్ష, నిర్లక్ష్యం వల్ల తెలంగాణ రైతులు మరింత చితికిపోయారు. అందుకే మలిదశ తెలంగాణ ఉద్యమం రైతు సమస్యల పునాదిగానే నిర్మితమైంది. చంద్రబాబు ప్రభుత్వం కరెంటు చార్జీలు పెంచడంపై నిరసన తెలిపి నేను ఉద్యమానికి శ్రీకారం చుట్టాను. పోరాడి తెలంగాణ తెచ్చుకున్నాం. ఇప్పుడు మనకు రైతులే ప్రధానం. వారికోసం ఒక్కో పనిచేసుకుంటూ పోతున్నం. ముందుగా 17వేల కోట్ల రుణమాఫీ చేసుకున్నాం. 9 గంటల ఉచిత విద్యుత్ అందించాం. త్వరలోనే 24 గంటల ఉచిత విద్యుత్ అందివ్వబోతున్నాం. విత్తనాలు, ఎరువులు సకాలంలో అందేలా చూశాం. కల్తీ విత్తనాల వల్ల నష్టపోకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నాం. మిషన్ కాకతీయ ద్వారా చెరువులు బాగు చేసుకుంటున్నాం. కోటి ఎకరాలకు నీరందించేందుకు ప్రాజెక్టులు నిర్మించుకుంటున్నాం. వచ్చే ఏడాది నుంచి ఎకరానికి ఎనిమిది వేల పెట్టుబడి అందిస్తున్నాం. గిట్టుబాటు ధర రావడం కోసం రైతు సంఘాలను ఏర్పాటు చేస్తున్నాం. మార్కెట్లో పంటకు డిమాండ్ ఉండే విధంగా క్రాప్ కాలనీలు ఏర్పాటు చేస్తున్నాం. వీటన్నింటి ఫలితంగా రాష్ట్రంలో రైతుల బతుకు బాగుపడుతుందని నమ్ముతున్నా. ఇవన్నీ అమలయ్యాక.. ఓ ఐదేళ్ళు గడిచాక రైతు జీవితాల్లో ఎంతో మార్పు వస్తుంది. బ్యాంకులు రైతుల ఇండ్ల ముందు నిలబడి అప్పులిస్తాం అనే పరిస్థితి వస్తుంది. ఇది నేను కంటున్న స్వప్నం. తప్పక నిజమై తీరుతుంది. కొద్ది పాటి చర్యలతోనే పాలమూరు జిల్లాలో ఎంతో మార్పు వచ్చింది. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తుండడంతో అక్కడ రివర్స్ మైగ్రేషన్ వచ్చింది. సింగూరు ఆయకట్టుకు నీరివ్వడం వల్ల కూడా మెదక్ జిల్లాలో పరిస్థితి మెరుగైంది. ఈ రెండు జిల్లాల నుంచి హైదరాబాద్

వలస వచ్చిన వారు తమ రేషన్ కార్డులు వాపస్ ఇచ్చి స్వంత జిల్లాలకు పోయారు. ఇది నాకెంతో సంతృప్తినిచ్చింది. భూమిపై నీరు పారడంతో ఈసారి మహబూబ్ నగర్ జిల్లా వాతావరణం కూడా మారింది. మంచి వర్షాలు పడుతున్నాయి. రైతుల ముఖంలో ఆనందం కనిపిస్తున్నది. ఇదే నేను కోరుకున్నది. తెలంగాణ సాధన ఫలితాలు రైతులకందాలి. వారు బాగుపడాలి. జిడిపి లెక్కలు, ఆర్థిక వేత్తల అంచనాలు నాకు అవసరం లేదు. ఎక్కువ మంది ఆధార పడిన వ్యవసాయ రంగం బాగుండాలనేదే నా గుడ్డి లెక్క. అందుకే ఖర్చు గురించి ఆలోచించకుండా రైతుకు ఏమి కావాలంటే అది చేసుకుపోతున్నం" అని ముఖ్యమంత్రి వివరించారు.

**సిపిఆర్ఓ టు సిఎం**